
మాట్లాడుతున్న ప్రొఫెసర్

# ఐఐటీహెచ్‌లో ఇన్వెంటివ్ 2024

## ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

సంగారెడ్డి జనవరి 5(నమస్తే తెలంగాణ): ఐఐటీ హైదరాబాద్‌లో ఇన్వెంటివ్ 2024 నిర్వహించటం గొప్ప అవకాశంగా భావిస్తున్నామని, రెండు రోజులపాటు నిర్వహించే మెగా ఇన్వెంటివ్ ఫెయిర్‌ను విజయవంతం చేస్తామని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. 19, 20 తేదీల్లో జరిగే ఇన్వెంటివ్ ఫెయిర్‌లో 120 కొత్త ఆవిష్కరణలను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఇందులో ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ఆవిష్కరణలు ఉన్నట్లు తెలిపారు. సాంకేతిక విద్యాసంస్థల్లో జరిగే పరిశోధనల ఫలితాలతో దేశ ఆర్థికవ్యవస్థ మరింత పురోభివృద్ధి చెందుతుందన్నారు. అయితే పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలు సాంకేతిక విద్యాసంస్థతో కలిసి పనిచేయటంతోపాటు పరిశోధనలకు మరింత ఎక్కువగా నిధులు సమకూర్చాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఐఐటీలు, ఇంజినీరింగ్ విద్య వైపు విద్యార్థులు ఆసక్తిచూపటంలేదన్న విలేకరుల ప్రశ్నను డైరెక్టర్ బీఎస్ మూర్తి కొట్టి పారేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఇంజినీరింగ్ చేసేందుకు ఆసక్తిచూపుతున్నారని ఇందుకు సాంకేతిక విద్యాసంస్థల్లో ఏటా విద్యార్థుల సంఖ్య పెరగటమే నిదర్శనమన్నారు. మొదటితరం ఐఐటీలతో పోలిస్తే రెండోతరం ఐఐటీలు మంచి ఫలితాలు, ర్యాంకింగ్‌లు సాధించటంలేదన్న విమర్శలు సహేతుకం కాదన్నారు. రెండోతరం ఐఐటీలు మంచి ఫలితాలు, ర్యాంకులు సాధిస్తున్నట్లు చెప్పారు. ఐఐటీ హైదరాబాద్ కొత్త ఆవిష్కరణలతో పాటు ఇతర అంశాల్లో దేశంలో మూడోస్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఐఐటీ హైదరాబాద్ ద్వారా 135 స్టార్టప్ కంపెనీలు ప్రారంభమై రూ.1200 కోట్ల రెవెన్యూ సాధిస్తున్నట్లు చెప్పారు. 19, 20న జరిగే ఇన్నోవేషన్ ఫెయిర్‌లో కొత్త ఆవిష్కరణలను ప్రదర్శించటంతోపాటు ప్యానెల్ డిస్కషన్లు ఉంటాయని తెలిపారు. అలాగే 20న మధ్యాహ్నం కళాశాల విద్యార్థులకు కొత్త ఆవిష్కరణలు చూసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

### ఏఐతో రోడ్డు ప్రమాదాల నివారణ

కృత్రిక మేధ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) సాయంతో రోడ్డు ప్రమాదాల నివారించేలా కొత్త ఆవిష్కరణలను రూపొందించినట్లు ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ పీజేనారాయణన్ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్ ఫెయిర్‌లో తమ సంస్థ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఇటీవల తమ సంస్థ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో కొత్త పరికరాలను రూపొందించినట్లు చెప్పారు. నాగ్‌పూర్‌లోని ప్రభుత్వ ప్రజా రవాణా వాహనాల్లో వీటిని ప్రయోగాత్మకంగా పరిశీలించగా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. త్వరలో తెలంగాణలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణ కోసం తాము రూపొందించిన ఏఐ టూల్స్‌ను వినియోగించనున్నట్లు చెప్పారు. వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి మాట్లాడుతూ ఇన్వెంటివ్ 2024లో ఎన్ఐటీలు పాలుపంచుకోనున్నట్లు తెలిపారు. ఎన్ఐటీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలన ప్రదర్శిస్తారని చప్పారు. ఇన్నోవేషన్ ఫెయిర్‌తో పరిశ్రమలు, సాంకేతిక విద్యాసంస్థల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. సమావేశంలో ఐఐటీ ప్రొఫెసర్లు చంద్రశేఖర్ శర్మ, సూర్యకుమార్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# 'మల్లన్న' ప్రత్యేక పూజల సామగ్రి సిద్ధం


స్వామి వారి కల్యాణం, పూజల సామగ్రిని శుభ్రం చేస్తున్న అర్చకులు

చేర్యాల, జనవరి 5 : ఈ నెల 7వ తేదీన కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యే క పూజల వెండి తదితర సామగ్రిని ఆలయ అర్చకులు సిద్ధం చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణంలో ఉపయోగించే స్వర్ణ కిరీటం, కోరమీసాలు, ఖడ్గం, రుద్రాక్షమాల, స్వామి వారి నామాలు, పంచహారతి, రుద్ర పాదం తదితర వెండి, పంచలోహ సామాగ్రికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆలయవర్గాలు సిద్ధం చేశాయి.స్వామి వారి కల్యాణోత్సవం మొదలుకొని ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన తదితర పూజలకు సదరు సామగ్రి కీలకం కావడంతో ప్రతి ఏటా ఆలయవర్గాలు స్వామి వారి కల్యాణోత్సవం ముందు రోజుల్లో వాటిని శుభ్రం చేసి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

# కల్యాణ మహోత్సవానికి భారీ బందోబస్తు

## అడిషనల్ డీసీసీ అడ్మిన్ శ్రీనివాస్‌రావు


కల్యాణ వేదిక గ్యాలరీల వద్ద ఆలయ ఈవో, అడిషనల్ డీసీపీ

చేర్యాల, జనవరి 5 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవానికి పోలీస్‌శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ నెల 2న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మల్లన్న క్షేత్రంలో పర్యటించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులు, దేవాదాయ, విద్యు త్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందికి సూచించిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషన్ డీసీపీ శుక్రవారం ఆయన మల్లన్న క్షేత్రంలో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం శీఘ్రదర్శనం, స్పెషల్ దర్శనం, సాధారణ దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూ, కల్యాణ కట్ట, వీఐపీ గ్యాలరీ, జనరల్ గ్యాలరీ తదితర వాటిని పరిశీలించారు.కల్యాణం పూర్తి అయిన తర్వాత భక్తులు స్వామి వారి వద్దకు వచ్చి అక్షింతలు వేసే సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇన్‌కమింగ్, అవుట్ గోయింగ్ ఏర్పాట్లు చేయించారు. వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్ ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భక్తులకు అసౌకర్యం లేకుం డా ఏర్పాట్లు చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. క్షేత్రంలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే పనులను పరిశీలించారు. పోలీస్ కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్ గురించి వీహెచ్‌ఎఫ్ సెట్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆయనతో జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, ఈవో బాలాజీ, ఏఈవో వైరాగ్యం అంజయ్య, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి ఎస్సై నాగరాజు, మద్దూరు ఎస్సై యూనిస్ హైమద్ అలీ, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఈ నెల 7న కొమురవెల్లి మల్లన్న కల్యాణం
- కల్యాణానికి హాజరుకానున్న 30వేల మంది భక్తులు
- పార్కింగ్ స్థలాలు ఏర్పాటు
- 125 కాటేజీలు సిద్ధం, సీసీ కెమెరాలతో నిఘా
- 60వేల లడ్డూ ప్రసాదాల తయారీ
- పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి కొండా సురేఖ




విద్యుత్ కాంతులతో కొమురవెల్లి మల్లన్న ఆలయం

# మల్లన్న కల్యాణానికి ధూంధాం

చేర్యాల, జనవరి 5 : తెలంగాణ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 7న జరిగే మల్లన్న కల్యాణోత్సవానికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు హాజరుకానున్నారు.స్వామి వారి క్షేత్రంలోని సీసీ రోడ్లను శుభ్రం చేయడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణ కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు. తోటబావి వద్ద నిర్మించిన శాశ్వత కల్యాణ వేదిక, ఆలయ సుందరీకరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఉత్సవాల ఏర్పాట్ల పై కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు స్వామి వారి కల్యాణోత్సవానికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

### కల్యాణోత్సవానికి 30 వేల మంది భక్తులు

స్వామి వారి కల్యాణోత్సవానికి 30 వేల మంది భక్తులు హాజరయే అవకాశం ఉన్నందున మల్లన్న ఆలయ అధికారులతో పాటు ప్రభుత్వశాఖ అధికారులు వారికి వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.కల్యాణ వేదిక తోటబావి ప్రాంతంలో నిర్మించిన శాశ్వత కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, షామియానులు, పచ్చదనం ఉట్టిపడే విధంగా పలు ఏర్పాట్లు చేస్తున్నారు.ఆలయానికి వచ్చిన భక్తులు దేవుని సన్నిధిలో సేదతీరేందుకు గంగరేగుచెట్టు, కల్యాణ వేదిక, ప్రసాదాల విక్రయశాల వద్ద చలువ పందిళ్లు తదితర వసతులు ఏర్పాటు చేశారు.స్వామి వారి కల్యాణోత్సవంతో పాటు బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు మిషన్ భగీరథపథకంలో భాగంగా సరఫరా అవుతున్న గోదావరి నీటిని నల్లాల ద్వారా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్వామి వారి క్షేత్రంలో (గోదావరి జలాలు) తాగునీటిగా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. దీనికి తోడు ఆలయవర్గాలకు చెందిన 18 బోర్లు, 15 నీటి ట్యాంకులు, 300 కుళాయిలు సిద్ధం చేశారు.స్వామి వారి క్షేత్రంలో 3 సులబ్ కాంప్లెక్స్‌లు, బస్ స్టేషన్ వద్ద తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నారు.దీంతో పాటు భక్తుల స్నానాల కోసం 200 షవర్స్ ఏర్పాటు చేశారు. వీటితో పాటు షవర్స్ పక్కనే మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.పస్తుతం ఉన్న ఆర్టీసీ బస్సులు కాకుండా సిద్దిపేట, జనగామ జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.రాజీవ్ రహదారిలోని మల్లన్న స్వాగత తోరణాల వద్ద అన్ని ఆర్టీసీ డిపోల బస్సులు నిలుపాలని ఆలయవర్గాలు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ప్రత్యేకంగా లేఖలను పంపించారు. స్వామి వారి క్షేత్రానికి వచ్చే భక్తుల వాహనాలను నిలిపేందుకు ఇబ్బందులు తలెత్తకుండా మూడు ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.

కొమురవెల్లి మల్లన్న క్షేత్రం వ్యూ



### 'మల్లన్న' కల్యాణ వేద పర్యవేక్షణకు ఉజ్జయిని పీఠాధిపతి



కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవ వేద పర్యవేక్షణకు మధ్యప్రదేశ్ ఉజ్జయని పీఠాధిపతి సిద్ధ లింగరాజ దేశికేంద్ర శివాచార్య మహాస్వామీజీ మల్లన్న క్షేత్రానికి రానున్నారు. స్వామిజీ ఈ నెల 6వ తేదీన రాత్రి పొద్దుపోయిన తర్వాత కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి చేరుకొనున్నారు.ఆదివారం వేకువజామున ఆలయవర్గాలు నిర్వహించే దృష్టికుంభాల కార్యక్రమంలో స్వామీజీ పాల్గొనడంతో పాటు శ్రీ మల్లికార్జున స్వామి వారి తొలి దర్శనాన్ని చేసుకోనున్నారు.అనంతరం ఉదయం 10.45 గంటలకు ప్రారంభమై కల్యాణోత్సవాన్ని పర్యవేక్షించనున్నారు.

### కల్యాణం వైభవంగా నిర్వహిస్తాం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.స్వామి వారి కల్యాణోత్సవానికి 30వేలకు పైగా భక్తులు హాజరుకానున్నారు.స్వామి వారి కల్యాణోత్సవం కాగానే భక్తులు అక్షింతలు వేసి స్వామి వారిని దర్శించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ కల్యాణోత్సవానికి హాజరుకానున్నారు. స్వామి వారి కల్యాణోత్సవానికి అన్నివర్గాలకు చెందిన భక్తులు హాజరుకావాలి.

– ఎ.బాలాజీ,ఆలయ ఈవో

# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రాజకీయాలకతీతంగా ఆలయ అభివృద్ధి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- కొమురవెల్లిలో ఏర్పాట్ల పరిశీలన
- క్యూలైన్లు పరిశీలించి ఆలయ ఈవోకు సూచనలు


ఆలయ అధికారులు, అడిషనల్ డీసీపీతో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 5 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయవర్గాలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన పర్యటించి కల్యాణవేదిక, గ్యాలరీలు, పోలీస్ బందోబస్తు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం క్యూలైన్లు పరిశీలించి ఆలయ ఈవో బాలాజీకి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాజకీయాలకతీతంగా కొమురవెల్లి మల్లన్న కల్యాణం నిర్వహించేందుకు తాము పూర్తి స్థాయిలో సహకరిస్తామన్నారు. ఆయన వెంట జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, ఉపసర్పంచ్ కొండా శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు సార్ల కిష్టయ్య, మెరుగు శ్రీనివాస్‌గౌడ్, తలారీ కిషన్, పడిగన్నగారి మల్లేశం, గొల్లపల్లి కిష్టయ్య, మేక సంతోష్, రసులాబాద్ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి, ముత్యం నర్సింహులు, మెరుగు కృష్ణ, జింకల పర్వతాలు, దుబ్బుడు వేణుగోపాల్‌రెడ్డి, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, గదరాజు చందు,స్వాములపల్లి కనుకచారి, బత్తిని నర్సింహులు, గోనే హరి పాల్గొన్నారు.

### మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ నియామకం

చేర్యాల, జనవరి 5 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీని నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 20 మంది సభ్యులతో కూడిన జంబో కమిటీని ప్రభుత్వం నియమించింది.పునరుద్ధరణ కమిటీ నాలుగు మాసాల పాటు కొనసాగనుంది. కమిటీలో పర్పాటకం లక్ష్మారెడ్డి, కొమ్ము రాజేశ్వరి, అంబాల ఉమారాణి, అల్లం శ్రీనివాస్, పయ్యావుల ప్రవీణ్‌యాదవ్, బోయిని సాయియాదవ్, లింగంపల్లి శ్రీనివాస్, ముస్త్యాల దామోదర్, ఎర్రబచ్చలి శ్రీనివాస్, మద్దికుంట శ్రీనివాస్, చిరుమల్ల నర్సింహులు, చీపురు భిక్షపతి, కాయితా మోహన్ రెడ్డి, గడ్డం వీరభద్రప్ప, పి. శ్రీనివాస్, తాళ్లపల్లి రమేశ్, కామిడి రమణారెడ్డి, సి.కిరణ్ కుమార్, బండారు మధుసూదన్, కె.అంజయ్యాయాదవ్‌కు చోటు కల్పించారు.



# ప్రజల వద్దకే ప్రజాపాలన

జోగిపేటలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన మంత్రి

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తాం
- వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహా
- జోగిపేట ప్రభుత్వ దవాఖానలో వసతుల పరిశీలన


అందోల్ : జోగిపేటలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహా

అందోల్, జనవరి 5: ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్రంలో ప్రజాపాలన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం అందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 17, 18 వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి రసీదులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని, ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇందిరమ్మ పాలన తరహాలోనే పరిపాలను ప్రజల ముందుకు తీసుకువచ్చి ప్రజల సమక్షంలోనే వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన అన్ని హామీలను అమలుచేస్తూనే అందోల్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసామ్తన్నారు. అందోల్–జోగిపేట కన్నతల్లిలాంటిదని ఇక్కడి ప్రజలకు ఏ కష్టం రాకుండా చూస్తానని చెప్పారు. అన్ని వార్డుల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తానని అందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అనంతరం జోగిపేట ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేసిన మంత్రి వార్డుల్లో తిరుగుతూ పేషెంట్లు, వారి బంధువులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యసేవలు, కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. దవాఖాన సూపరింటెండెంట్ రమేశ్ మంత్రిని శాలువాతో సన్మానించి అందిస్తున్న వైద్యసేవలను వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, జడ్పీసీఈవో ఎల్లయ్య, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, చిట్టిబాబు, రేఖాప్రవీణ్, శివశంకర్, రంగ సురేశ్, నాగరాజు, దుర్గేశ్, హరికృష్ణ గౌడ్, చెందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ డాకూరి వెంకటేశం పాల్గొన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వట్‌పల్లి, జనవరి 5 : అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంతోపాటు మంచిర్యాల తండా, పోతులబోగుడలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వట్‌పల్లి ప్రజాపాలనలో మంత్రి మాట్లాడుతూ..అభయ హస్తం పథకంతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతుందన్నారు. ఒక్క దరఖాస్తులోనే సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలు ఉండటంతో అవన్నీ ఒకేసారి అమలవుతాయన్నారు. దరఖాస్తుల స్వీకరణను అధికారులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, ఎంపీడీవో జగదీశ్వర్, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీపీ కృష్ణవేణి, సర్పంచ్ సురేఖాబుద్ధిరెడ్డి, ఎంపీటీసీ ఇందిరారాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి

రేగోడ్, జనవరి 5 : విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించనున్న రోబోటిక్స్ ఎక్స్ పో, ఇన్నోవేటివ్ ఫెస్ట్ కార్యక్రమ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ ఫెస్ట్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యార్థులు రోబోటిక్స్, సైన్స్, ఆర్ట్స్, లాంగ్వేజెస్, వోకేషనల్ సబ్జెక్టులకు సంబంధించిన నమూనాలను ప్రదర్శిస్తారని, అన్ని గ్రామాల నుంచి విద్యార్థులు, యువకులు, నాయకులు, అధికారులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి విచ్చేయాలని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్ ఖాజా పాల్గొన్నారు.


వట్‌పల్లి : వట్‌పల్లిలో ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ